క్లుప్తంగా

అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు : సీఐ



కంచికచర్ల : నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు నందిగామ రూరల్ సర్కిల్ సీఐ పీ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని గని ఆత్కూరులో శుక్రవారం పోలీస్ సిబ్బందితో నిర్వహించిన కవాతులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు తలెత్తకుండా రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని కోరారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఇప్పటికే పోలీసు కవాతు నిర్వహించడంతోపాటు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తుంటే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. కవాతులో ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ-2 హేమలత, ఏఎస్ఐ రామారావు, దుర్గారావు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

27న ఆలయ భూముల కౌలువేలం

మక్కపేట(వత్సవాయి) : గ్రామంలో వేంచేసి యున్న శ్రీకోదండరామాలయం, రామలింగేశ్వర, రాజగోపాల, కాశీవిశ్వేశ్వర, అత్తిలి సారంగమఠంనకు చెందిన వ్యవసాయ భూములకు ఈనెల 27 న బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఈవో సీహెచ్ హరి దుర్గానాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.మొత్తం 78.47ఎకరాల భూమి కౌలుకు ఇస్తున్నట్లు వివరించారు. గ్రామంలోని రామాలయం ఆవరణలో నిర్వహించే ఈ కౌలువేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.10వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల వ్యక్తులు కౌలువేలంలో పాల్గొనాలని ఈవో కోరారు.

భవిత సెంటర్‌లో 22మందికి అడ్మిషన్



కంచికచర్ల : స్థానిక హనుమాన్‌పేట, మోడల్‌కాలనీ, ప్రణీత కాలనీల్లోని దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించేందుకు శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్టీ ఎం.కనకారావు ఇంటింటి తిరిగి ప్రత్యేకావసరాలుగల చిన్నారుల వివరాలను సేకరించారు. దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు భవిత సెంటర్‌లో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు.సర్వేలో భాగంగా గుర్తించిన 22మందికి భవితసెంటర్‌లో చేర్పించినట్లు వివరించారు. భవిత సెంటర్‌లో విద్యనభ్యసించే వారికి పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తున్నట్లు వివరించారు. మూడేళ్లలోపు చిన్నారులను అంగనవాడి కేంద్రాల్లో చేర్పించాలని, మూడేళ్లు నిండిన ప్రత్యేక అవసరాలు చిన్నారులను భవిత సెంటర్‌లో చేర్పించాలని తెలిపారు.

అమ్మవారికి ఊయల సేవ



నందిగామ: మండలంలోని లింగాలపాడు శ్రీలక్ష్మి పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి సమయంలో అమ్మవారికి ఊయల సేవ చేశారు. ఆయా పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

నందిగామ: పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం స్థానిక మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వేసవి కారణంగా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందకపోతుండటంతో పట్టణ ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కటారపు గోపాల్ కోరారు. అయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం

పుట్రేల(విస్సన్నపేట): విద్యార్థులు పోటీతత్వంతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పుట్రేలలో పదోతరగతి పరీక్షల్లో 500 మార్కులకుపైగా సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతిగా సూర్యనారాయణరెడ్డి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున 13 మంది విద్యార్థులకు శుక్రవారం నగదు బహుమతి అందజేశారు. రేపోదు రుక్మిణి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 15వేలు ఆర్థిక సాయంగా అందజేశారు.



కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయ ముఖమండపం



అలనాటి శిల్పకళా నైపుణ్యానికి ప్రతీకలుగా నిలిచే శిల్పాలు



కృష్ణమ్మ ఒడిలో చేపలు పడుతున్న జాలర్లు

వేసవిలో దర్శనీయ ప్రాంతం గుడిమెట్ల

- గంభీరంగా ప్రవహించే కృష్ణమ్మ
- చారిత్రక కట్టడాలు, శిల్పకళలకు నెలవు
- పర్యాటక కేంద్రానికి ఏమాత్రం తీసిపోని ప్రకృతి అందాలు
- ఆధ్యాత్మికత, ప్రకృతి రమణీయతల కలబోత గుడిమెట్ల



రెండు కొండల మధ్య ప్రవహిస్తున్న కృష్ణానది



చూపు తిప్పుకోనివ్వని ప్రకృతి సౌందర్యం

నందిగామ: రెండు కొండలపై ఉన్న అత్యంత పురాతన ఆలయాలు...చుట్టూ పచ్చని చెట్లు...గంభీరంగా ప్రవహించే కృష్ణానది...చూడగానే మనసును ఆహ్లాదపరచే వాతావరణం..నాటి శిల్ప కళా నైపుణ్యాన్ని చాటి చెప్పే శిల్పకళాకృతులు, విలువైన వజ్రాలను తనలో నింపుకున్న భూమాత..చూపు తిప్పుకోనివ్వని ప్రకృతి సౌందర్యం..ఇదంతా చందర్లపాడు మండలం, గుడిమెట్ల గ్రామానికే సొంతం. ఇటు ప్రకృతి సోయగానికి, అటు ఆధ్యాత్మిక భావనకు ప్రతీకగా నిలుస్తూ, రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉండే ఈ ప్రాంతం ప్రకృతి ప్రేమికులకు ఓ మరపురాని అనుభూతినిస్తోంది.

నందిగామ నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈప్రాంత ప్రకృతి సౌందర్యం ప్రకృతి ప్రేమికులను ఇట్టే ఆకట్టుకుంటోంది. నందిగామ నుంచి ఈప్రాంతానికి చేరుకునేందుకు బస్సు, ఆటో సదుపాయం ఉంది. చాగిరాజులు, శ్రీకృష్ణ దేవరాయలు వంటి దిగ్గజాలు ఏలిన ప్రాంతం ఇది. వీరి హయాంలోనే ఈ గ్రామం ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లిందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా ఆలయాలు..

జిల్లా సరిహద్దులోని రామన్నపేట(గుడిమెట్ల), ఉమ్మడి గుంటూరు జిల్లా సరిహద్దు ప్రాంతమైన పుట్ల గూడెం మధ్య కృష్ణానది పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తూ ఉంటుంది. ఎంతో గంభీరంగా కన్పించే కృష్ణమ్మ అంతే ప్రమాదకారి కూడా. ఈప్రాంతంలో కృష్ణా నది ఎక్కడా లేనివిధంగా అత్యంత లోతులో ప్రవహిస్తుంది. ఇక రెండు కొండలపై ఉన్న అనేక ఆలయాలు, శిల్ప కళలు నాటి రాజుల ఆధ్యాత్మికతను, కళాపిపాసను ప్రస్ఫుటం చేస్తాయి. ముఖ్యంగా గుడిమెట్లలో ఉన్న రామలింగేశ్వర స్వామి, ద్వారకా వెంకటేశ్వరస్వామి ఆలయాలు ఎంతో ప్రఖ్యాతిగాంచినవి. శ్రీకృష్ణ దేవరాయలు కాలంలో వీటి నిర్మాణం జరిగినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. కొండపై ఉన్న ఈ ఆలయాలను 2016లో పునర్నిర్మాణం చేశారు. ఇటీవల కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన అరుంధతి, ఆది జాంబవ విగ్రహాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

తొలకరితో వజ్రాల వేట మొదలు..


గుడిమెట్ల ప్రాంతం వజ్రాలకు కూడా ఎంతో వాసికెక్కింది. ఈప్రాంతంలో ఎన్నో దశాబ్దాలుగా వజ్రాల కోసం వేట కొనసాగుతూనే ఉంది. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి కూడా ఏటా వజ్రాల వేట కోసం పలువురు ఈ గ్రామానికి వస్తుంటారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైందంటే గ్రామంలో సందడి నెలకొంటుంది. వివిధ ప్రాంతాల నుంచి ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై ఔత్సాహికులు తరలివచ్చి వజ్రాల వేట కొనసాగిస్తూనే ఉంటారు. ఇలా ఆధ్యాత్మికత, ప్రకృతి రమణీయతల కలబోతగా గుడిమెట్ల ప్రాంతం విరాజిల్లుతోంది.



కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన అరుంధతి, ఆదిజాంబవ విగ్రహాలు

ఆహ్లాదకరమైన వాతావరణం..

ఇక్కడ రెండు కొండల మధ్య ప్రవహించే కృష్ణమ్మను చూసేందుకు రెండు కళ్లు చాలవు. ఎన్టీఆర్, ఉమ్మడి గుంటూరు జిల్లాల సరిహద్దులను వేరు చేస్తూ ప్రవహించే కృష్ణానది లోతును అంచనా వేయలేం.



కొండపై ఉన్న ద్వారకా వెంకటేశ్వరస్వామి ఆలయం

జుజ్జూరులో పోలీసు కవాతు



జుజ్జూరు(వీరులపాడు): శాంతిభద్రతలు, ప్రజాజీవనానికి విఘాతం కలిగిస్తూ అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని వీరులపాడు ఎస్ఐ మహాలక్ష్మడు హెచ్చరించారు. జుజ్జూరులో శుక్రవారం సాయంత్రం పోలీసులు ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం రాష్ట్రంలో పలుచోట్లు అల్లర్లు జరిగిన నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఘర్షణలకు పాల్పడే వారిని, ప్రజలను భయాభ్రాంతులకు గురిచేసేందుకు యత్నించేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 4 జరగనున్న ఓట్లలెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పటికే పోలీసు పికెట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. పాతనేరస్తులు, రౌడీలు, ఘర్షణలకు పాల్పడేవారిని ముందుగానే గుర్తించి వారిని బైండోవర్ చేసినట్లు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని ఎస్ఐ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంతో పాటు మండలంలోని కె.అగ్రహారం, ముక్త్యాల, త్రిపురవరం ప్రాంతాల్లో శనివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ సందిరెడ్డి కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనా స్రవంతి



సంకీర్తనలను గానం చేస్తున్న సీవీపీ శాస్త్రి



సంకీర్తనలను గానం చేస్తున్న చారుమతీ పల్లవి

విజయవాడ కల్చరల్: శ్రీ వెంకటేశ్వర సంకీర్తన అకాడమీ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నమయ్య సంకీర్తనా స్రవంతి మధురంగా సాగుతోంది. శుక్రవారం నాటి కార్యక్రమంలో యువ సంగీత కళాకారులతో పాటు ప్రముఖ సంగీత విద్వాంసులు అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. అదివో అల్లదివో శ్రీహరివాసము, తిరువీధుల తిరిగే దేవ దేవుడు, బ్రహ్మ మొక్కటే తదితర కీర్తనలను హైదరాబాద్‌కు చెందిన శివ సాయి చరణ్, మల్లాది అనన్య, చారుమతీ పల్లవి, మల్లాది అభిజ్ఞ, మేడూరి రఘురాం, కె.గోపాలరావు, మేడూరి శివరాం, గాయత్రీ గౌరీనాథ్, సీవీపీ శాస్త్రి ఆలపించారు. సత్య బాబు, ప్రసాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు: ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. మోదుమూడి అంజనా సుధాకర్, ఎ.కోదండ రామయ్య, జీవీఆర్ సంగీత కళాశాల విద్యార్థులు లంక తేజస్వి తదితరులు అన్నమయ్య సంకీర్తనలను గానం చేస్తారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: స్రవంతి కృష్ణ ఎంటర్‌టైనర్స్, తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయనీ గాయకులు స్రవంతి కృష్ణ, సుశీల్ కుమార్, బెల్లంకొండ భారతి, మల్లాది స్వాతి, కేఎస్ఎన్ మూర్తి, వెంకట్, శ్రావణి, ఉమా బలరాం, రుగ్వేదం సోదరీమణులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రాహ్మణ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణమూర్తి మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని, వారిని గౌరవించుకోవాలని సూచించారు. అనంతరం గాయనీ గాయకులను సత్కరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, కె.డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో కీసర-గండేపల్లి రోడ్డు

- రోడ్డును ఆక్రమించి ఇళ్లు, షాపుల నిర్మాణం
- కుంచించుకుపోయిన రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ప్రమాదాలకు నిలయంగా కీసర హైవే రోడ్డు



గండేపల్లి నుంచి కీసర వెళ్లే రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో స్తంభించిన ట్రాఫిక్

కంచికచర్ల : మండలంలోని జాతీయ రహదారిలో కీసర నుంచి గండేపల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురికావడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. కొంత మంది వ్యక్తులు ఈరోడ్డును ఇరువైపులా స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు, ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో రోడ్డంతా కుంచించుపోయింది. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అవరోధం ఏర్పడుతూ ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఆయా షాపులకు వచ్చేవారు కూడా తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుచేస్తుండటం ట్రాఫిక్‌కు మరింత అవరోధం ఏర్పడుతోంది. ఈ రోడ్డు కంచికచర్ల మండలంలోని గండేపల్లి గ్రామాన్ని కలుపుకుంటూ వీరులపాడు మండలం జమ్మవరం, బోడవాడ, నందలూరు, తాటిగుమ్మి, జుజ్జూరు తదితర గ్రామాలకు వెళ్తుంది. అంతేకాకుండా ఇదే రోడ్డుకు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం వరకు నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గండేపల్లి సమీపంలో ఓ ఫ్యాక్టరీకి కూడా ఉండటంతో వందలాది మంది కార్మికులు రోజూ బస్సులు, ఆటోల్లో రాకపోకలు సాగిస్తుంటారు. కీసర, గండేపల్లి గ్రామాల్లో ఈ రోడ్డు మార్జిన్ స్థలాలను కొందరు దర్జాగా ఆక్రమించుకుని షాపుల నిర్మాణం చేపట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. మరికొందరు ఆయా షాపులను అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా ఆక్రమణల కారణంగా 40 అడుగులు రోడ్డు కాస్తా..15నుంచి 20అడుగులకు కుంచించుకుపోయి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

హైవేలోనూ ఆక్రమణలే..

విజయవాడ- హైదరాబాద్ నేషనల్ హైవేపై కీసర వద్ద కొంతమంది అనుమతులు లేకుండా అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేశారు. రాత్రి పగలు తేడా లేకుండా దుకాణాలు నడుపుతున్నారు. దీంతో హైవేపై వాహనదారులు తమ వాహనాలను అడ్డదిడ్డంగా రోడ్డుపై నిలుపుదల చేస్తుండటంతో పలుమార్లు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల గండేపల్లి రోడ్డు నుంచి పెండ్యాల రోడ్డుకు వెళ్లేందుకు ఓవ్యక్తి బైక్‌పై హైవే దాటేందుకు ప్రయత్నించే సమయంలో ఓ వాహనం ఢీకొని తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కీసరలో టోల్‌ప్లాజా ఉండటంతో రాత్రిపగలు దుకాణాలు తెరిచే ఉంటుండటం, పలువురు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుదల చేస్తుండంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా ఆర్అండ్‌బీ, జిల్లా పరిషత్ అధికారులు స్పందించి కీసర-గండేపల్లి రోడ్డులో ఆక్రమణలను తొలగించడంతోపాటు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. అదేవిధంగా కీసరలో హైవేలో హోటళ్ల వద్ద రోడ్డుపై వాహనాలు నిలుపుదల చేయకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా వసంతోత్సవం



తెప్పోత్సవంలో పాల్గొన్న భక్తులు



వసంతోత్సం కోసం స్వామివార్లను తీసుకువస్తున్న భక్తులు

వేదాద్రిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీనరసింహ స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారికి చూర్ణోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు, యోగానందాచార్యులు, శ్రీధరాచార్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో హేమలతాదేవి, కేసీపీ సిమెంట్స్ ప్రతినిధి రాంప్రసాద్, సర్పంచి గుడాలు పేరయ్య పాల్గొన్నారు. అదేవిధంగా గురువారం రాత్రి స్వామివారికి తెప్పోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి ఇందిరాదత్తు ఆధ్వర్యంలో శ్రీబాలాత్రిపుర సుందరి అమ్మవారి ట్రస్టు, కేసీపీ సిమెంట్స్ సహకారంతో మల్లెపూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన పడవలో స్వామివార్ల ప్రతిమలు ఉంచి నిర్వహించిన తెప్పోత్సవం కనుల పండువగా సాగింది. జగ్గయ్యపేట అర్బన్



తెప్పోత్సవంలో స్వామివార్లు



వసంతోత్సవంలో స్వామివార్లు

సత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్: సంక్షేమ పాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం బలుసుపాడు సమీపంలోని సత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా సామినేని ఉదయభాను గెలుపొందాలని అమ్మవారిని కోరుకున్నారు. ఆపార్టీ జగ్గయ్యపేట 57వ పోలింగ్ పోలింగ్‌కేంద్రం కన్వీనర్ గద్దం శ్రీకాంత్ నేతృత్వంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దువ్వల రామకృష్ణ, తిరుమలగిరి దేవస్థానం పాలకమండలి సభ్యులు కనిగిరి సుబ్బారావు, కమటాల సతీష్ పాల్గొన్నారు.